# నూతన హెల్త్ స్కీమ్‌తో గందరగోళం

## స్కీంపై ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆగ్రహం

**సిద్దిపేట అర్బన్, మే 31, ప్రభాతవార్త :**
నూతన ఎంప్లాయిస్ హెల్త్ స్కీం హెల్త్ కేర్ ట్రస్ట్ అమలు విధానంతో ఉపాధ్యాయ,ఉద్యోగ వర్గాల్లో గందరగోళ పరిస్థితి నెలకొందని టిఎస్ సిపిఎస్ఈయు రాష్ట్ర ఉపాధ్యక్షులు కురాకుల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒకటి పాయింట్ ఐదు శాతం నిర్బంద కోతను వెనక్కి తీసుకోవాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. ముందస్తు సమాచారం స్పష్టమైన మార్గదర్శకాలు లేకుండా ఏకపక్షంగా ఉపాధ్యాయుల బేసిక్ పే నుంచి 1.5 శాతం నిర్బంధంగా జీతాల కోత విధించడాన్ని ఈ పథకంలో సిపిఎస్ రిటైర్డ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అవలంభిస్తున్న సాంకేతిక వివక్షపై యూనియన్ వ్యతిరేకిస్తుందన్నారు. హెల్త్ కార్డుల మంజూరు వాటి వినియోగంపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను విడుదల చేయలేదని అన్నారు. ఆసుపత్రులతో ఒప్పందాలు శూన్యం ఏ ఆసుపత్రిలో ఉచిత వైద్యం అందుతుందో స్పష్టమైన జాబితా లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గందరగోల పరిస్థితులను అదుపు చేసి ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

# వార్త



పోలీసులు సీజ్ చేసిన ఇసుక టిప్పర్

# ఇసుక టిప్పర్ సీజ్

**బెజ్జంకి,మే 31, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని దేవక్కపల్లి బస్టాండు సమీపంలో వాహన తనిఖీల సందర్భంగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న అశోక్ లేలాండ్ టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. రేణికుంట గ్రామ పరిధిలోని మోయతుమ్మెద వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తవ్వి తరలిస్తున్నట్లు తెలిపారు. హరి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

# సంగారెడ్డిలో సంచలనం..

..భర్త కళ్లముందే భార్య దారుణ హత్య

**అమీన్ పూర్, మే 31, ప్రభాతవార్త :** సంగారెడ్డి జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. జిన్నారం మండలం ఐడీఏ బొల్లారంలోని గండిగూడెం క్రీడా ప్రాంగణం సమీపంలో శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు మహిళను హత్య చేయడం తీవ్ర కలకలం రేపింది. భర్త కళ్లముందే భార్యను పొదల్లోకి లాక్కెళ్లి గొంతు కోసి హత్య చేసినట్లు ప్రాథమిక సమాచారం వెలుగులోకి రావడం స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది.పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. భార్యాభర్తలు అనిల్ కుమార్, మీనా దేవి (35) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గండిగూడెం క్రీడా ప్రాంగణం వద్ద వారి బైక్ అకస్మాత్తుగా ఆగిపోయింది. ఈ క్రమంలో పొదల్లో దాక్కున్నట్లు భావిస్తున్న కొందరు దుండగులు ఒక్కసారిగా బయటకు వచ్చి మీనా దేవిని బలవంతంగా పొదల్లోకి లాక్కెళ్లినట్లు తెలుస్తోంది.భార్యను రక్షి ంచేందుకు ప్రయత్నించిన భర్త అనిల్ కుమార్‌ను దుండగులు అడ్డుకుని కత్తులతో దాడి చేసినట్లు సమాచారం. అనంతరం అతని కళ్లముందే మీనా దేవి గొంతు కోసి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. తీవ్ర గాయాలపాలైన అనిల్ కుమార్‌ను స్థానికులు వెంటనే సమీప ఆసుపత్రికి తరలించగా, ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.ఘటన సమాచారం అందుకున్న బొల్లారం పోలీసులు, క్లూస్ టీమ్ ఘటనాస్థలికి చేరుకుని ఆధారాలు సేకరించినట్లు సమాచారం. హత్యకు గల కారణాలపై పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. వ్యక్తిగత విభేదాలు, పాత కక్షలు లేదా ముందస్తు ప్రణాళికతో దాడి జరిగిందా అనే అంశాలపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సమీప ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే, పోలీసులు అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.ఈ దారుణ ఘటనతో ఐడీఏ బొల్లారం పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్థానికులు రాత్రి వేళల్లో భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుబాటులో ఉన్న సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# హుస్నాబాద్‌లో ఎబిసిడిలదే పట్టు...కౌన్సిలర్లు సైడ్‌లైనేనా..?

- ఆ నలుగురి చేతుల్లో మున్సిపాలిటీ..?
- పాలకవర్గంలో హాట్ టాపిక్...!

**హుస్నాబాద్ రూరల్, మే 31, ప్రభాతవార్త :** హుస్నాబాద్ మున్సిపాలిటీలో ప్రస్తుతం "ఏబీసీడీ రాజకీయం" నడుస్తోందంటూ రాజకీయ వర్గాలు, పాలకవర్గ సభ్యుల మధ్య తీవ్ర చర్చ సాగుతోంది. మున్సిపల్ వ్యవహారాల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధుల కంటే కొందరు ప్రభావశీల నేతల పాత్ర ఎక్కువగా ఉందనే ప్రచారం జోరుగా వినిపిస్తోంది. స్థానిక రాజకీయ విశ్లేషకుల కథనం ప్రకారం "ఎ" అంటే హుస్నాబాద్ మాజీ ఎంపిపి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త ఆకుల వెంకన్న, "బి" అంటే మాజీ సింగిల్ విండో చైర్మన్ బోలిశెట్టి శివయ్య, "సి" అంటే మున్సిపల్ వైస్ చైర్మెన్ చిత్తారి పద్మ-రవి, "డి" అంటే ప్రస్తుత మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మితో పాటు హుస్నాబాద్ పట్టణ కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వడ్డెపల్లి రమణల చుట్టూ



హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయం దృశ్యం

రాజకీయాలు తిరుగుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు, పరిపాలనా నిర్ణయాలు, నిధుల కేటాయింపుల విషయంలో ఎన్నికైన కౌన్సిలర్లతో పాటు బిఆర్ఎస్ పార్టీకి చెందిన అభిప్రాయాలకు తగిన ప్రాధాన్యత లభించడం లేదని కొందరు కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధుల ప్రమేయం లేకుండానే కొన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. మరోవైపు ఈ ప్రచారంలో ఎంత వరకు వాస్తవం ఉందనే అంశంపై కూడా చర్చ కొనసాగుతోంది. మున్సిపల్ పాలనలో పారదర్శకత ఉండాలని, కౌన్సిలర్లకు తగిన ప్రాధాన్యత కల్పించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందని మేదావులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# చదువుతోనే సమాజంలో గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న హరీష్‌రావు

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి:** కాంగ్రెస్ సర్కార్ యాదవులను పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు.జిల్లా కేంద్రంలోని యాదవ సంఘంలో ఆదివారం ఏర్పాటు చేసిన యాదవ విద్యార్థుల ప్రతిభా పురస్కార అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.కెసిఆర్ హయాంలో యాదవులకు సంక్షేమానికి పెద్ద పీట వేయడంతో పాటు చట్ట సభల్లో సైతం అవకాశం కల్పించడం జరిగిందన్నార.కాంగ్రెస్ సర్కార్ హయాంలో కనీసం బీసీ కార్పోరేషన్ లేదు బీసీల భివృద్ధి పట్టించుకోవడం లేదన్నారు.కెసిఆర్ ప్రవేశపెట్టి అమలు చేసిన గొర్రెల పథకాన్ని నేడు కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోవడం లేదన్నారు.ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నతస్థానాలకు చేరుకోవాలన్నారు. చదువుకు కులం, పేదరికం అడ్డు కాదని కష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చునని తెలిపారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు.కార్యక్రమంలో యాదవ సంఘం ప్రతినిధులు శ్రీహరి, ఐలయ్య,కాల్వ ఎల్లయ్య, బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు,పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కన్వెర్ట్ క్రిస్టియన్‌లకు రిజర్వేషన్ వర్తించదని ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అనేక జీవితాల్లో ఇబ్బంది పెట్టె విధంగా ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని సీసీ గార్డెన్ సమీపంలో గల బేతస్థ ప్రార్థన మందిరం వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు.సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అందరం ఖండించాల్సిన అవసరం ఉందన్నారు.కెసిఆర్ పాలనలో క్రిస్టియన్స్‌కి క్రిస్మస్ గిఫ్ట్‌ను ప్రారంభించుకున్నామని అధికారికంగా క్రిస్మస్ పండుగ జరిపిన ఏకైక రాష్ట్ర తెలంగాణ అన్నారు.కెసిఆర్ పాలనలో క్రైస్తవులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిందని గుర్తు చేశారు.

**సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ**

సిద్దిపేట నియోజకవర్గంలో వివిధ కారణాలతో ఆసుపత్రిలో చేరి ఆర్థిక భరోసా కొరుకు సిఎం సహాయ నిధి ద్వారా 214 చెక్కులు మంజూరు కావడంతో హరీష్‌రావు చేతుల మీదుగా పంపిణీ చేశారు.

ప్రభుత్వ రంగంలో ఇంటర్మీడియట్ విద్యను నిర్వీర్యం చేసే కుట్రలు తగవని...వెంటనే పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు డిమాండ్ చేశారు.సిద్దిపేట జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ సత్యనారాయణరెడ్డి పదవి విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.నాటి సిఎం వీపీ నరసింహారావు, చుక్కా రామయ్య లాంటి పెద్దలు ప్రవేశపెట్టిన ఇంటర్మీడియట్ విద్యా విధానం వలనే నేడు ప్రపంచ వ్యాప్తంగా తెలుగు బిడ్డలు అద్భుతమైన ఇంజనీర్లుగా సైంటిస్టులుగా రాణిస్తున్నారని తెలిపారు.గత ప్రభుత్వాలు కాంట్రాక్ట్ వ్యవస్థను తెచ్చి ఇంటర్ విద్యను నిర్వీర్యం చేస్తే బిఆర్ఎస్ ప్రభుత్వంలో సిఎం కెసిఆర్ చొరవతో 5,500 మంది కాంట్రాక్ట్ ఆధ్యాపకులను క్రమబద్దీకరణ చేసిన ఘనత మాదే అన్నారు.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

**గజ్వేల్, మే 31 (ప్రభాతవార్త):**
ప్రజా పాలన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, ముఖ్యంగా పేద ప్రజలకు అండగా ఉండడం కోసం ప్రజాపాలన ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలోని ఐఓసి కార్యాలయంలో నియోజకవర్గం పరిధిలోని 1053 కళ్యాణలక్ష్మి, 56 షాదిముబారక్ లబ్ధిదారులకు రూ.11 కోట్ల 9 లక్షలు చెక్కుల రూపంలో అంద జేయడంతో పాటు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కాటమయ్య కిట్లను మంత్రి చేతులమీదుగా అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాపాలన ప్రభుత్వంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి కొత్తగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు పిల్లలకు ఉదయం అల్పాహారం పెట్టడం జరుగుతుందన్నారు. నిరుపేద విద్యార్థులకు మంచి చదువుతో పాటు నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయడం జరిగిందని, ప్రభుత్వ కార్యక్రమాలకు వచ్చే మహిళలు ఇందిరమ్మ చీరలు ధరించి హాజరుకావాలన్నారు. గజ్వేల్ నియోజకవర్గానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ పెట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా గతంలో భూమిపూజ చేయించడం జరిగిందన్నారు. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా స్కూల్ స్థాపించి నిరుపేద పిల్లలకు కూడా మంచి కార్పోరేట్ స్థాయి చదువును అందించనున్నామని తెలిపారు. వైద్యం విషయంలో రూ.10 లక్షలు రాజీవ్ ఆరోగ్యశ్రీతో పాటు సిఎంఆర్ఎఫ్ చెక్కుల ద్వారా రోగులకు భరోసా కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడానికి ప్రతి నియోజకవర్గానికి ఒక అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుచేసి అందులో చదివే పిల్లలకు రూ.2వేల స్టైఫాండ్ ఇవ్వడంతో పాటు మంచి శిక్షణ ఇచ్చి వారికి జర్మన్ లాంగ్వేజ్ నేర్పించాలని ఆలోచన ఆయా దేశాల్లో ఉద్యోగాలు చేయాలనే రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో గతంలో మంజూరుచేసిన ఇందిరమ్మ ఇళ్లు 50 శాతం పూర్తి అయ్యాయని, వచ్చే నెల రోజుల్లో నియోజకవర్గానికి మరో 2500 ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ రబీ సీజన్‌లో ధాన్యం అనుకున్న దానికంటే 30 శాతం ఎక్కువ రావడంవల్ల కొనుగోలు సమస్యలు తలెత్తాయని, అన్ని సమస్యలు పరిష్కరించి రైతులు పండించిన పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతులు ఎవరు కూడా ఆందోళన చెందవద్దన్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు చేరేందుకు అధికార యంత్రాంగం పనిచేస్తుందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాలు చేరవేయనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే సిద్దిపేట జిల్లా ముందు వరుసలో ఉందని, మంజూరైన ప్రతి ఇంటిని పూర్తి చేసేలా అధికారులు పనిచేస్తున్నారన్నారు.

ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యను బలోపేతం చేయడానికి మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహార పథకం



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

ప్రభుత్వం అమలు చేస్తుందని పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టిందని, అదే పథకాన్ని నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రవేశపెట్టి చెక్కులను అందజేయడం అభినందనీయమన్నారు. ఆరు నెలలకు ఒకసారి కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను పంపిణీ అయ్యే విధంగా చూడాలని అన్నారు. చాలా రోజుల నుంచి లబ్ధిదారులు ఆసక్తిగా ఎదురుచూశారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను అందించేవిధంగా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, మార్కెట్ కమిటీ చైర్మన్లు వంటేరు నరేందర్‌రెడ్డి, విరూపాక శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్‌లో బస్-బే ప్రారంభం

**గజ్వేల్, మే 31 (ప్రభాతవార్త):**
గజ్వేల్ పట్టణంలో నూతనంగా నిర్మించిన బస్-బేను రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చేతులమీదుగా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ అధునాతన హంగులతో నూతనంగా ప్రయాణీకులకు సౌకర్యంగా బస్టాండ్ నిర్మించడం జరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో రూ.2 కోట్ల 56 లక్షలతో బస్టాండ్‌ను నిర్మించినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో బస్టాండ్‌ల నిర్మాణాలను అసంపూర్తిగా గాలికి వదిలేశారని, ప్రయాణీకుల ఇబ్బందులు చూడలేక



గజ్వేల్‌లో బస్-బేను ప్రారంభిస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

బస్టాండ్ నిర్మాణాన్ని పూర్తి చేయించడం జరిగిందన్నారు. ఆయన వెంట ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, మాజీ ఫుడ్ కార్పోరేషన్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు వంటేరు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ పావన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, స్థానిక కౌన్సిలర్లు నాయిని సత్యలక్ష్మి యాదగిరి, నక్క సంతోష రాములుగౌడ్, గుంటుకు లక్ష్మి శ్రీనివాస్, నరసింహారెడ్డి, రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఊడెం సారిక శ్రీనివాస్‌రెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు యాదగిరి, వాహెద్, మతీన్, గోపిశెట్టి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**మునిపల్లి,మే 31(ప్రభాతవార్త):**
అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా వేగవంతం చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి దామోదర రాజనర్సింహా అధికారులను ఆదేశించారు. ఆదివారం నాడు మునిపల్లి మండలంలోని బుదేరా మహిళా డిగ్రీ కళాశాల భవనం నిర్మాణం పనులు, లింగంపల్లి గురుకుల పాఠశాల భవన నిర్మాణం, తక్కెడపల్లి గార్లపల్లిల మధ్య డబ్బావాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను పరిశీలించారు. వర్షాకాలం సమీపిస్తున్నందున పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.



తక్కెడ పల్లి బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న మంత్రి దామోదర రాజానర్సింహా

బుదేరా మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లింగంపల్లిలో నూతన భవన నిర్మా ణానికి అదనంగా నిధులు మంజూరికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట నాయకులు సతీష్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్ పద్మ దుర్గయ్య, విజయ్ కుమార్, మాజీ ఎంపిటీసీ పాండు,సంగమేశ్వర్,నరేందర్ గౌడ్,సర్పంచులు వెంకట్రాములు మల్లేష్, నారాయణ, మల్లేశం,మమత నగేష్,అశోక్ తదితరులు వున్నారు.

# నమ్మి ఓట్లు వేస్తే నట్టేట ముంచారు

.. ఆరు గ్యారెంటీల పేరుతో అరచేతిలో స్వర్గం చూపించారు
.. రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో పటాన్ చెరులో బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు చేస్తాము
.. పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
.. ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్
.. పటాన్ చెరులో ఘనంగా బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గస్థాయి సభ్యత్వ నమోదు అవగాహన కార్యక్రమం

**పటాన్ చెరు,మే 31,ప్రభాత వార్త :**ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేడు వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తూ అబద్దాల పునాదులపై పాలన కొనసాగిస్తోం దని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దుయ్య బట్టారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంలో దేశంలో అగ్రగామిగా తీర్చిదిద్దితే నేడు సీఎం రేవంత్ రెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

నాయకత్వంలో ఇండ్ల కూల్చివేతలు, రైతుల రోదనలు, నిరుద్యోగుల ఆక్రందనలు, హామీల ఎగవేతలతో పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని తొమ్మిది డివిజన్లలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేసి కేసీఆర్ కు గిఫ్ట్ గా అందిస్తామని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఆదివారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ పార్టీ పటాన్ చెరు నియోజకవర్గస్థాయి సభ్యత్వ నమోదు అంశంపై బూత్ లెవెల్ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్, సభ్యత్వ నమోదు నియోజకవర్గ ఇంచార్జి ఎర్రోళ్ల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అందరూ గర్వపడేలా పార్టీని పటిష్టం చేయడంతో పాటు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య కార్యకర్తలు సమన్వయకర్తలుగా పనిచేశారని తెలిపారు. మూడుసార్లు పటాన్ చెరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఎగురవేయడంతో పాటు ప్రతి ఎన్నికల్లోను గులాబీ జెండాను రెపరెపలాడించామని అన్నారు. ప్రతి గెలుపులో కార్యకర్తల కష్టం మరువలేనిదని అన్నారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించుకునే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. త్వరలో జరగనున్న బల్దియా ఎన్నికలకు కార్యకర్తల సిద్ధం కావాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి పటాన్ చెరు నియోజకవర్గంలోని నిరుపేదలకు కాళరాత్రులు ప్రారంభమయ్యాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా పేరుతో పేదోడి గుడిసెల పైకి బుల్డోజర్ ను పంపిస్తూ వారి జీవితాలను ఆగమాగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చి నేడు వాటిని అమలు చేయకుండా అబద్దాలతో కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని వివిధ పరిశ్రమల ద్వారా అందిస్తున్న సిఎస్ఆర్ నిధులను స్థానిక అభివృద్ధి పనులకు కేటాయించాలని, లేనిపక్షంలో వేలాది మందితో కలిసి జిల్లా కలెక్టరేట్ ను ముట్టడించడం జరుగుతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు నియోజకవర్గ ఇంచార్జి ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. పటాన్ చెరు నియోజకవర్గం అంటేనే బీఆర్ఎస్ పార్టీకి కంచుకోట అని, ఎమ్మెల్యే జీఎంఆర్ నాయకత్వంలో రాష్ట్రంలోని రికార్డు స్థాయిలో పటాన్ చెరు నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదులో ప్రతి కార్యకర్త ఉత్సాహంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు, భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

### కాకతీయుల కాలం నుంచి కొనసాగుతున్న

# రేణుక ఎల్లమ్మ జాతర వైభవం

## భక్తుల సౌకర్యార్థం కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు - ధర్మకర్తల వెల్లడి

**హుస్నాబాద్ రూరల్, మే 31, ప్రభాతవార్త :** హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం కాకతీయుల కాలం నాటి చారిత్రక ఆలయంగా ప్రసిద్ధి చెందింది. ఆలయం సమీపంలోని చెరువుకు "ఎల్లమ్మ చెరువు"గా నామకరణం చేయడం విశేషం. ప్రతి సంవత్సరం వైశాఖ పౌర్ణమి నుంచి జ్యేష్ఠ పౌర్ణమి వరకు జరిగే జాతరలో వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ఒడిబియ్యం, బోనాలు సమర్పిస్తూ మొక్కులు చెల్లించుకుంటారు. జాతర ప్రారంభాన్ని గౌడ కులస్తుల శాశ్వత ధర్మకర్తలు అమ్మవారికి బాసింగాలు కట్టి ప్రారంభిస్తారు. ప్రతీ ఏటా జ్యేష్ఠ పౌర్ణమి రోజున అమ్మవారి బాసింగాలు విప్పి జాతరను ముగిస్తారు. ఈ నేపథ్యంలో ఆదివారం రోజున హుస్నాబాద్ పట్టణ



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గౌడ కులస్తులు జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా అమ్మవారి బాషింగాలు విప్పి ప్రత్యేక పూజలు నిర్వహించి జాతర ముగిసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత ధర్మకర్తలు పూదరి లక్ష్మీనారాయణ గౌడ్, పచ్చిమట్ల రవీందర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, చంద్రమోళి గౌడ్, మాటూరి గోపి గౌడ్, పచ్చిమట్ల శివ గౌడ్, నరేష్ గౌడ్, రజనీకాంత్ గౌడ్, బొమ్మగాని సదానందం గౌడ్, మాటూరి ప్రేమ్ కుమార్ గౌడ్, బాలయ్య, మోహన్ గౌడ్, దేవాలయ ఈవో పి. కిషన్‌రావు, తాటికొండ పరమేశ్వర్, ఆలయ సిబ్బంది కుమారస్వామి, గీకురు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన మున్సిపల్ కమిషనర్‌గా జి.ప్రభాకర్

**జహీరాబాద్, మే 31, ప్రభాతవార్త :**
జహీరాబాద్ నూతన మున్సిపల్ కమిషనర్‌గా జి .ప్రభాకర్ నియమితులయారు. ఈ మేరకు మున్సిపల్ ఉన్నత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతవరకు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన జైత్రీరామ్ నాయక్ ఆదివారం పదవి విరమణ చేశారు. ఈయన స్థానంలో జి.ప్రభాకర్ కమిషనర్ గా నియమితులయ్యారు. కమిషనర్‌గా నియమితులైన జి. ప్రభాకర్ గతంలో జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారిగా పనిచేసే బదిలీపై వెళ్ళారు. తిరిగి ప్రమోషన్‌పై మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**గుమ్మడిదల, మే 31, ప్రభాతవార్త :**గుమ్మడిదల మండలంలోని 33/11 కేవీ నల్లవల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తపల్లి, నాగిరెడ్డిగూడెం, నల్లవల్లి గ్రామాలు మరియు పరిసర పరిశ్రమలకు సోమవారం (01/06 /2026) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు గుమ్మడిదల ఏ.డి.ఈ దుర్గాప్రసాద్ తెలిపారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పోల్స్ మరమ్మతులు, విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు చేపట్టడంతో పాటు తీగల కింద ఉన్న చెట్లను తొలగించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కారణంగా ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.ప్రజలు, పరిశ్రమల యాజమాన్యాలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బొంతపల్లి ఏ.ఈ రవీందర్‌తో పాటు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## కాలనీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తా

**అమీన్‌పూర్, మే 31, ప్రభాతవార్త :** బీరంగూడ డివిజన్ పరిధిలోని సృజన లక్ష్మీ ్మ నగర్ కాలనీలో పర్యటించిన పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్.. నూతనంగా నిర్మించిన కాలనీ కమాన్‌ను ప్రారంభించారు. అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి తన సొంత నిధులతో ఈ కమాన్‌ను నిర్మించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్ లావణ్య శశిధర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాటా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాలనీల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, సామాజిక సేవకులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న శశిధర్ రెడ్డి సేవలను ఆయన అభినందించారు.కాలనీవాసులు తన దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. బీరంగూడ డివిజన్ పరిధిలో శశిధర్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సేవా కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని కొనియాడారు. ప్రజాసేవ పట్ల ఆయన చూపుతున్న అంకితభావం అభినందనీయమని అన్నారు.శశిధర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కోసం భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. కాలనీవాసుల సహకారంతో ప్రాంత అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, కాలనీకి ప్రత్యేక గుర్తింపుగా నిలిచే విధంగా సొంత నిధులతో కమాన్ నిర్మించి అందించిన శశిధర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షి ంచారు.ఈ కార్యక్రమంలో బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, కమిటీ డైరెక్టర్స్ చెద్రశేకర్, మల్లేష్ యాదవ్,మల్లేష్, అశగరి లక్ష్మణ, మాజీ కౌన్సిలర్ మున్న,ఆత్మ కమిటీ డైరెక్టర్ పల్లపు బిక్షపతి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డి.రవీందర్, డి.రమేష్ ప్రకాష్ జితప్పా, బి.శీను బందంకొమ్ము సతన్న, శీను, సాయి, ఏ.మహిపాల్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సృజన లక్షి ్మ నగర్ కాలనీ ప్రెసిడేట్ శ్రీనివాస్ ఈతార కాలనీ ప్రెసిడెంట్ లు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో


నర్సాపూర్ కెమిస్ట్ డ్రగ్గిస్ట్ నర్సాపూర్ అసోసియేషన్ ఆధ్వర్యంలోజరిగిన సమావేశంలో పాల్గొన్న సభ్యులు

పాల్గొన్నారు.

## నర్సాపూర్ కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులుగా శ్రీనివాస్

**నర్సాపూర్, మే 31, ప్రభాతవార్త :** నర్సాపూర్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా సభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా జిల్లా అధ్యక్షుడు తొడుపునూరి రాజు, జిల్లా సెక్రెటరీ సంగమేశ్వర ఆధ్వర్యంలో నర్సాపూర్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జరిగిన ఎన్నికలలో ఏడవ సారి ఏకగ్రీవంగా అధ్యక్షులు శ్రీనివాస్ వరుసగా ఎన్నికయ్యారు. అంతేగాక కార్యదర్శులుగా కొండా శ్రీకాంత్ కోశాధికారిగా మాచర్ల శ్రీనివాస్ మాచర్ల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా రాధాకృష్ణ శేఖర్ రామకృష్ణారెడ్డి వేణు శ్రీనివాస్ శివంపేట్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు

## ముస్లాపూర్ విద్యార్థులు బాసర ఐఐటీకి ఎంపిక

**అల్లాదుర్గం, మే 31, ప్రభాతవార్త :**
అల్లాదుర్గం మండలంలోని పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ ముస్లాపూర్ పాఠశాలకు చెందిన 7 మంది విద్యార్థులు బాసర ఐఐటీ లో ప్రవేశానికి ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది.ఎంపికైన విద్యార్థులు 1. నేహ 2. నందు 3. దుర్గప్రసాద్ 4. భువనేశ్వరి 5. సాయికుమార్ 6. నవప్రసన్న 7. అంజయ్య సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. రమేష్ విద్యార్థులను అభినందించి, వారి కృషి, పట్టుదల, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం వల్ల ఈ విజయం సాధ్యమైందని,భవిష్యత్తులో కూడా ఉన్నత లక్ష్యాలను సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షి ంచారు.పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులను ప్రశంసిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపింది. ఈ విజయం పాఠశాలలో చదువుతున్న ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.విద్యార్థుల ఈ అద్భుత విజయంపై అధికారులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## దత్తాత్రేయ స్వామికి ఘనంగా పాలాభిషేకం

**గజ్వేల్ టౌన్, మే 31 (ప్రభాతవార్త):**
గజ్వేల్ పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో దత్తాత్రేయ స్వామికి రావికంటి చంద్రశేఖర్ దంపతులు పౌర్ణమి సందర్భంగా అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు అల్పాహారం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంగునూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రతినెల పౌర్ణమి రోజున అభిషేకం చేయడం జరుగుతుందని అన్నారు. దత్తాత్రేయ స్వామి అందరిని చల్లగా చూడాలని అన్నారు. వారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప దేవాలయ అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్, అత్తెల్లి రాజేశం, దూబకుంట లక్ష్మణ్,


దత్తాత్రేయ స్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

# ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి

**గజ్వేల్, మే 31 (ప్రభాతవార్త):**
వడ్లను వెంటనే కొనుగోలు చేయాలని గజ్వేల్ మండలంలోని శ్రీగిరిపల్లి, అక్కారం, రిమ్మనగూడ, దిలాల్‌పూర్, బూర్గుపల్లి, అహ్మదీపూర్, పిడిచెడ్, ధర్మారెడ్డిపల్లి, కొడకండ్ల గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను, ఐకేపి, పిఎసిఎస్ సెంటర్‌లను మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆదివారం బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి రైతుల ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గజ్వేల్ నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని కొనుగోలు కేంద్రాలలో రైతులు రెండు మాసాలుగా 45 డిగ్రీల ఎండలో ఎండబెట్టిన వరి ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో వర్షాలకు నాని రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో కెసిఆర్ ప్రభుత్వంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో మాజీ మంత్రి హరీష్‌రావు చొరవతో ఎప్పటికప్పుడు అధికారులతో రివ్యూ మీటింగ్ పెట్టుకొని ప్రజాప్రతినిధులు, అధికారులు అందరు కలిసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేశారని తెలిపారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు విషయంలో విఫలమైందని మండిపడ్డారు. ఎంపి రఘునందన్‌రావు మైకులకు మాత్రమే సరిపోతాడని రైతుల గోసలు పట్టవని, ఇంత వరకు ఏ గ్రామాన్ని సందర్శించిన పాపాన


వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

పోలేదన్నారు. వడ్ల కొనుగోలు విషయంలో ఎంపి రఘునందన్‌రావు చొరవ తీసుకొని రైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. రైతుల పంటలను కొనుగోలు చేయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గద్దె దిగాలని, జూన్ 4వ తేదీ వరకు వడ్లు కొనుగోలు చేయకుంటే రాజీవ్ రహదారిని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట మాజీ ఏఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్, చంద్రమోహన్‌రెడ్డి, బాలచంద్రం, బొల్లారం ఎల్లయ్య, రాజిరెడ్డి, మురళి, అశోక్, భాస్కర్, రాజు, అబ్దుల్లా, అహ్మద్, రమేష్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, నిజాం, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తులం బంగారం ఎప్పుడు ఇస్తారు..?

**-అమలుకాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్**
**-పథకాల లబ్ధి కోసం ఎదురుచూస్తున్న ప్రజలు**
**-మున్సిపల్ వైస్ చైర్మన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి**

**గజ్వేల్, మే 31 (ప్రభాతవార్త):** ఎన్నికల్లో హామీ ఇచ్చిన కళ్యాణలక్ష్మి పథకంలో రూ.లక్షా 1,116తో పాటు తులం బంగారం ఇస్తామని ప్రచారం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం తులం బంగారం ఎప్పుడు ఇస్తారని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగరావు ప్రభుత్వంపై మండిపడ్డారు. ఆదివారం కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కుల పంపిణీ అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలుకాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 30 నెలలు గడిచినా లబ్ధిదారులకు రెండుసార్లు సైతం కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులు అందజేయలేదని, గత ప్రభుత్వంలో కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను వధువరుల సమక్షంలోనే అందజేసినట్లు గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో మహిళలకు 2500, 18 ఏళ్ల నిండిన యువతులకు స్కూటీలు, ల్యాప్‌టాప్‌లు అందిస్తామని చెప్పి ఏ


కళ్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగరావు

ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# హిందూ సమాజ ఐక్యతే దేశానికి శ్రీరామ రక్ష

**గజ్వేల్ టౌన్, మే 31 (ప్రభాతవార్త):**
లోకమాత అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలను ఆదివారం గజ్వేల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సామాజిక సమరసతా వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్‌జీ అహల్యాబాయి హోల్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అహల్యాబాయి హోల్కర్ ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నప్పటికీ మానసిక దృఢత్వంతో ప్రజలనే తన కుటుంబంగా భావించి ముప్పైమూడు సంవత్సరాలు రాజ్యాన్ని సమర్థవంతంగా పరిపాలించారని గుర్తుచేశారు. హిందూ సమాజం ఐక్యంగా ఉంటే భారతదేశం మరింత పటిష్టంగా ఉంటుందని పేర్కొన్నారు. కులాలు వేర్వేరు అయినప్పటికీ మనుషులంతా ఒక్కటేనని, పిల్లల్లో దేశభక్తి, దైవభక్తి పెంపొందించాలని పిలుపునిచ్చారు. సామాజిక సమరసత వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నరేష్‌బాబు, రాష్ట్ర మహిళా కన్వీనర్ రుక్మిణిలు మాట్లాడుతూ అహల్యాబాయి హోల్కర్ జీవితం నేటి యువతకు ఆదర్శమని, రైతుల సంక్షేమం కోసం చెరువులు తవ్వించడం,


అహల్యాబాయి హోల్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అప్పల ప్రసాద్‌జీ

దేవాలయాల నిర్మాణం, ప్రజా సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఆమె లోకమాతగా గుర్తింపు పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సిద్ధు, బింగి స్వామి, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మరాఠి కృష్ణమూర్తి, సరస్వతి శిశుమందిర్ పాఠశాల ప్రిన్సిపల్ హరిణ పవన్, సీనియర్ జర్నలిస్ట్ పి.వెంకటేశం, టియుడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షుడు జి.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# మునిపల్లిలో జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు

**మునిపల్లి,మే 31(ప్రభాతవార్త):**
మండల కేంద్రమైన మునిపల్లిలో ఆదివారం నాడు పిఏసిఎస్ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.పెద్ద చెల్మెడ పిఏసిఎస్ చైర్మన్ పద్మ దుర్గయ్య కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ
మునిపల్లిలో జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటుతో రైతులకు ఇబ్బందులు తొలుగుతాయని అన్నారు.మునిపల్లి చుట్టుపక్కల గ్రామాల రైతులు పెద్దచెల్మెడ జొన్నల కొనుగోలు కేంద్రానికి వెళ్ళడానికి ఇబ్బందులు పడేవారన్నారు. మంత్రి దామోదర
ఆదేశాను సారం మునిపల్లిలో జొన్నల కేంద్రం ఏర్పాటు అయిందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిపల్లి గ్రామ సర్పంచ్ సౌందర్యనరేందర్ గౌడ్,పిఏసిఎస్ వైస్ చైర్మన్ సరోజినిదేవి,డైరెక్టర్ సంగన్న,ఉప సర్పంచ్ పాండు వార్డ్ సభ్యులు వంశీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మునిపల్లిలో జొన్నల కేంద్రాన్ని ప్రారంబిస్తున్న పిఎసి చైర్మన్ పద్మ దుర్గయ్య

**విధి విధానాలు లేకుండా**

## వేతనంలో కోత సరైనది కాదు

**టీపీటీఫ్ రాష్ట్ర అధ్యక్షులు అనిల్ కుమార్..**

**సంగారెడ్డి మున్సిపాలిటీ మే 31, ప్రభాతవార్త :** ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేయబోతున్న ఎంప్లాయిస్ హెల్త్ స్కీం అమలు చేయడం కోసం మార్గదర్శకాలు లేకుండానే వేతనంలో కోత పెట్టడం సరైనది కాదు అని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్ ఆరోపించారు. వెంటనే మార్గదర్శకాలు విడుదల చేయాలని డిమాండ్ చేసారు. జూన్ 2 నుండి పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పి, ఇంతవరకు విధివిధానాలు జారీ చేయకపోవడం శోచనీయమని అన్నారు. ఆదివారం సంగారెడ్డి లోని సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సోమశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్, రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మయ్య యాదవ్, రాష్ట్ర కౌన్సిలర్ భూమి శ్రీనివాస్, వెంకట్ రాథోడ్, భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు నాసర్ పటేల్, మల్లికార్జున్, విజయ్ భాస్కర్, విట్టల్, బాబు రావు, జిల్లా కార్యదర్శులు అశోక్ కుమార్, గోవింద్, మేకల శ్రీనివాస్, జగన్నాథం, కిషన్ రావ్, దీపక్ కుమార్, ప్రభాకర్, కిష్టయ్య, అజీమ్, నాగేశ్వర్, రహమ్ పాల్గొన్నారు.

## కాళ్లకుంట కాలనీ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**సిద్దిపేట అర్బన్, మే 31, ప్రభాతవార్త :**
జిల్లా కేంద్రంలోని కాళ్లకుంట కాలనీ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం పద్మశాలి సంఘ భవనంలో ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి మద్దెల మల్లేశం, సహాయ అధికారి పుట్ట గణేష్ ఆధ్వర్యంలో ఎన్నికలను నిర్వహించారు. కాళ్లకుంట కాలనీ పద్మశాలి సంఘం అధ్యక్షులుగా స్వర్గం రమేష్, ఉపాధ్యక్షులుగా గరిదాస్ మేథినీకుమార్, ప్రధాన కార్యదర్శిగా యెల్ల శ్రీధర్‌కుమార్, కోశాధికారిగా ఎర్రగుంట నరేందర్, సహాయ కార్యదర్శిగా గోశిక నారాయణలు ఎన్నికయ్యారు. విజేతలకు ఎన్ని కల అధికారి మద్దెల మల్లేశం, సమన్వయకర్త కుమ్మరి కుంట రమేష్ ధృవీకరణ పత్రాలు అందజేశారు. నూతన పాలకమండలిని పలువురు పద్మశాలి ప్రతినిధులు అభినందించి సత్కారించారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.


నూతన కార్యవర్గం




## మతోన్మాద, మోసపూరిత విధానాలపై పోరాడాలి

**-ఘట్‌కేసర్‌లో సిపిఎం శిక్షణా తరగతులు**

**ఘట్‌కేసర్, మే 31, ప్రభాతవార్త:** దేశ సమైక్యతలకు బిజెపి విధానాలతో ప్రమాదం పొంచి ఉందని మోసపూరిత మోదీ విధానాలు కార్పొరేట్లకు వరాలు కురిపిస్తూ కష్టజీవులపై భారాలు మోపుతున్నాయని మతోన్మాద విధానాలపై మహోద్యమం నిర్మించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.స్కైలాబ్‌బాబు పిలుపునిచ్చారు. ఘట్‌కేసర్‌లో సీపీఎం మండల స్థాయి రాజకీయ శిక్షణా తరగతులలో భాగంగా రెండోరోజు ఆయన హాజరై మతం మతోన్మాదం అనే అంశంపై క్లాస్ బోధించారు. తరగతులకు సీపీఎం మండల కార్యదర్శి ఎన్.సబిత ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సిపిఎం అనేక పోరాటాలు నిర్మిస్తుందని, భవిష్యత్తులో సీపీఎం చేపట్టబోయే ఉద్యమాలలో ప్రజలు ప్రత్యక్షంగా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈతరగతుల్లో సీపీఎం విశిష్టత పని పద్ధతులు అనే అంశంపై సీపీఎం రాష్ట్ర కమిటీటి సభ్యులు బుర్రి ప్రసాద్ క్లాసు భోధించారు. ఈశిక్షణ తరగతుల్లో సీపీఎం సీనియర్ నాయకులు చింతల యాదయ్య, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సృజన, సిపిఎం మండల కమిటీటీ సభ్యులు కడమంచి యాదగిరి, కె.అలివేలు, జి.నాగమణి, చల్లగొండ అరుణ, ప్రేమలత, డి.పోచయ్య, శ్రీను, కె.బలరాం, ఎన్.లక్ష్మయ్య, డి.జ్యోతి, ఎన్.భవాని లలిత, క్రాంతికుమార్, శ్రావణి, లక్ష్మయ్య, కె.రాజిరెడ్డి, కె.శోభ, స్వప్న, శ్రీరాములు, సమత, ఐశ్వర్య, ఎల్లమ్మ, రాకేష్, లలిత తదితరులు పాల్గొన్నారు.


సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందిస్తున్న దృశ్యం

## సిఎంఆర్ఎఫ్ పేదలకు వరం

**.. ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి**

**రామచంద్రాపురం, మే 31, ప్రభాతవార్త :** సిఎంఆర్ఎఫ్ పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలోని ఎమ్మెల్సీ నివాసంలో మునిపల్లి మండలం మేలే సంఘం గ్రామానికి చెందిన శంకరయ్య, కొండాపూర్ మండలం మంచన్ పల్లికీ చెందిన గోవర్ధన్ చారి అనే లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ.. అనారోగ్య కారణాలతో వైద్యం చేయించుకుని, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న శంకరయ్య, కొండాపూర్ మండలం మంచన్పల్లికీ చెందిన వడ్ల గోవర్ధన్ చారి, కుటుంబాలకు ఈ ఆర్థిక సాయం ఎంతో ఊరటనిస్తుందన్నారు. పేద ప్రజలకు ఆపద కాలంలో ఆదుకోవడానికి సిఎం సహాయ నిధి ఒక వరంలా పని చేస్తోందని ఆయన అన్నారు. నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా తాము ఎల్లప్పుడూ కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. తమకు ఆర్థిక సాయం అందేలా సహకరించినందుకు లబ్ధిదారుడు ఎమ్మెల్సీకి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, మునిపల్లి మండల అధ్యక్షులు నాగిశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

**ఆలయ కమిటీ నూతన భవనం ప్రారంభం**

రామచంద్రాపురంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో నూతన ఆలయ కమిటీ భవనాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి ప్రారంభించారు. దేవాలయాల అభివృద్ధి, భక్తులకు వసతుల కల్పనలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. ఆ మల్లికార్జున స్వామి ఆశీస్సులు అందరిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం నిర్మించిన ఈ భవనం ఆలయ కమిటీ సేవా కార్యక్రమాలకు మరింత దోహదపడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, భవన నిర్మాణ దాత చిన్నమైల్ శంకర్ రెడ్డి, కురుమ సంఘం అధ్యక్షులు నర్సింలు, ఆలయ కమిటీ అధ్యక్షులు యాదగిరి, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## ప్రధాని మన్ కీ బాత్ ని వీక్షించిన ఎమ్మెల్సీ

**రామచంద్రాపురం, మే 31, ప్రభాతవార్త :** రామచంద్రాపురంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి ఆయన నివాసంలో వీక్షి ంచారు. దేశంలోని సామాన్య ప్రజల అసాధారణ విజయ గాథలను ప్రపంచానికి పరిచయం చేస్తూ, సామాజిక మార్పుకు స్ఫూర్తినిచ్చేలా ప్రధాని ప్రసంగం సాగిందని తెలిపారు. దేశ ప్రగతి ప్రయాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే వారి పిలుపు అద్భుతం అన్నారు. దేశాభివృద్ధిలో మనమంతా కలిసికట్టుగా ముందడుగు వేద్దామని ఎమ్మెల్సీ అంజిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, జిన్నారం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇందిరా పార్కు దీక్షను విజయవంతం చేయండి

**సంగారెడ్డి మున్సిపాలిటీ మే 31, ప్రభాతవార్త:** తెలంగాణ జాతీయ మజ్దూర్



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్

యూనియన్ ఆధ్వర్యంలో జూన్ 1వ సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో నిర్వహించే దీక్ష కార్యక్రమంకు అన్ని డిపోల నుండి వేలాదిగా తరలి వచ్చి దీక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిజెఎంయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ ఆర్టీసీ ఉద్యోగులకు పిలుపునిచ్చారు.. ఆదివారం సంగారెడ్డి లోని డిపో ముందు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ పల్లె కృష్ణమూర్తి మరియు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ జీవన్ రావు, సంగారెడ్డి రీజినల్ కార్యదర్శి అంజయ్య గౌడ్, డిపో అధ్యక్షుడు మహేందర్ డిపో కార్యదర్శి విక్రం డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ మధుకర్, డిపో జాయింట్ సెక్రెటరీ రవి, జైరాబాద్ డిపో సెక్రెటరీ నర్సింలు, శంకరయ్య, శశి కుమార్ వికారాబాద్ డివిజనల్ ప్రెసిడెంట్ వెంకటేష్ ముదిరాజ్, సంగారెడ్డి డిపో నాయకులు బిక్షపతి, కిషోర్, రవి, శంకర్, ఆంజనేయులు, బాలమణి, అనురాధ, శైలజ తదితరులు పాల్గొన్నారు.


హుస్నాబాద్ ఆర్టీసీ డిపో

## ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

**- ఎర్ర బ్యాడ్జీలతో విధులకు హాజరైన హుస్నాబాద్ డిపో ఉద్యోగులు**

**హుస్నాబాద్ రూరల్, మే 31, ప్రభాతవార్త :**తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్టీసీని పూర్తిస్థాయిలో ప్రభుత్వంలో విలీనం చేస్తూ అప్పాయింటెడ్ డేట్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ హుస్నాబాద్ ఆర్టీసీ డిపోలో ఉద్యోగులు ఆదివారం ఉదయం 5 గంటల నుంచి ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)ని ప్రభుత్వంలో విలీనం చేసి, సంబంధిత అప్పాయింటెడ్ డేట్‌ను వెంటనే ప్రకటించాలని కోరారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, ప్రభుత్వ ఉద్యోగులతో సమాన హక్కులు, సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ జేఏసీ నాయకులు ఆర్. సుధాకర్ రెడ్డి, వి.ఆర్.ఎం. రెడ్డి, కేఎస్. చారి, బి. రాజు, బి. సురేష్, ఎం. పవన్ తదితరులు పాల్గొన్నారు.

## గంప శ్రీనివాస్‌కు ఘన సత్కారం

**సిద్దిపేట అర్బన్, మే 31, ప్రభాతవార్త :**సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గంప శ్రీనివాస్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులుగా నియామకమైన సందర్భంగా ఆదివారం జిల్లా ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి డాక్టర్ మాంకాల నవీన్‌కుమార్, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం మాజీ కార్యదర్శి మాంకాల నాగరాణిలు చేతుల మీదుగా శాలువాలతో ఘనంగా సత్కారించారు. అలాగే ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులుగా నియమితులైన అయిత రత్నాకర్‌లను సత్కారించారు. గంప శ్రీనివాస్,అయిత రత్నాకర్ నియామకం జిల్లా ఆర్యవైశ్య సమాజానికి గర్వకారణమన్నారు.


రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులుగా నియమితులైన శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న దృశ్యం

## అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల దాడులు

**కోహెడ, మే 31, ప్రభాతవార్త :** కోహెడ మండలంలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించి ఒక బోలెరో వాహనం సీజ్ చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు వరికోల్ గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగునుంచి అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై మెరుపు దాడులు నిర్వహించారు. బోలెరో వాహనంలో వాగులో ఇసుక నింపి ఉంచగా వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చట్టరీత్యా కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ అభిలాష్ హెచ్చరించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బొలెరో వాహనం

## లారీ ఢీ కొని యువకుని మృతి

**చిన్నకోడూరు, మే 31, ప్రభాతవార్త :** లారీ ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రామునిపట్ల గ్రామంలోని రాజీవ్ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇబ్రహీంనగర్‌కు చెందిన కావటి ఎల్లం(40) సిద్దిపేటకు ద్విచక్రంపై వెళ్తున్న క్రమంలో వెనుక నుంచి టిఎస్ 08యుఎల్2778 నెంబరు గల లారీ ద్విచక్ర వాహనంతో పాటు ఎల్లంను సుమారు 50 మీటర్ల వరకు నెట్టుకు పోవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. బాధితుల ఫిర్యాదు మేరకు చిన్నకోడూరు ఎస్ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.

## బాసర ట్రిపుల్ ఐటికి 13 మంది విద్యార్థుల ఎంపిక

**నంగునూర్, మే 31, ప్రభాతవార్త :** బాసర ట్రిపుల్ ఐటీకి శనివారం సాయంత్రం విడుదల చేసిన జాబితాలో నంగునూర్ మండలం నుంచి 13 మంది విద్యార్థులు ఎంపికైనట్లు మండల ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నర్మెట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 7గురు, నంగునూర్ ఉన్నత పాఠశాల నుంచి 3, మగ్దూంపూర్ ఇద్దరు, గట్లమల్యాల ఉన్నత పాఠశాల నుంచి ఒక్క విద్యార్థి ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైనా విద్యార్థులను ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ ఎంపికపట్ల విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## మున్సిపల్ కమిషనర్ జైత్రామ్ నాయక్‌కు ఘన సన్మానం

**జహీరాబాద్, మే 30, ప్రభాతవార్త :** జహీరాబాద్ మున్సిపాలిటీలో కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ ఆదివారం పదవీ విరమణ పొందిన జైత్రామ్ నాయక్ దంపతులను మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, సిబ్బంది శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన సేవలను కొనియాడుతూ, మున్సిపాలిటీ అభివృద్ధికి చేసిన కృషిని అభినందించారు. అదేవిధంగా పదవీ విరమణ పొందుతున్న జైత్రామ్ నాయక్ దంపతులను పి ఆర్ టి యు, టీబీ ఈ ఎస్ ఎస్ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు సంగారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షులు డా. తులసిరామ్ రాథోడ్, టి బి ఎస్ ఎస్ జహీరాబాద్ డివిజన్ అధ్యక్షులు రమేశ్ బానోత్, డివిజన్ ప్రధాన కార్యదర్శి జైసింగ్ చవ్వాన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు తెలంగాణ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు డి. శ్రీనివాస్, డి. విట్టల్, బాలయ్య, జహీరాబాద్ టౌన్ అధ్యక్షులు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి తుకారామ్ చవ్వాణ్, జహీరాబాద్ రూరల్ అధ్యక్షులు బాగయ్య, ప్రధాన కార్యదర్శి అశోక్, న్యాల్కల్ అధ్యక్షులు మురళీధర్, ప్రధాన కార్యదర్శి పాండయ్యతో పాటు నాయకులు కిషన్ చవ్వాన్, వెంకటేశం, బీరయ్య, వెంకటేశ్వర్లు, హన్మంత్ పవార్, శేఖయ్య, సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హెల్త్ కార్డ్స్ మార్గదర్శకాలు విడుదల చేశాకే వేతనాలలో మినహాయించాలి

**మర్కుక్, మే 31 (ప్రభాతవార్త):** హెల్త్ కార్డ్స్ మార్గదర్శకాలు విడుదల చేశాకే వేతనాలలో మినహాయించాలని, నిర్బంధంగా అమలు చేయకుండా అవసరమున్న ఉపాధ్యాయులకు వర్తింపజేయాలని పిఆర్‌టియు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రేబల్లి శ్రీనివాసరావు, తుమ్మ కుమార్‌లు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల చిరకాల వాంఛ హెల్త్ కార్డు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ట్రస్ట్ పూర్తిస్థాయిలో ఉపాధ్యాయుల అనుమతి లేకుండా, ఎటువంటి మార్గదర్శకాలు లేకుండా, మనం దరఖాస్తు చేయకుండా మన డబ్బులు కట్ చేసుకోవడం దోపిడీకి, ప్రభుత్వ అహంకార పూరిత పరిపాలనకు నిదర్శనమని అన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన డిఏలు, పిఆర్‌సిలు ఇవ్వకుండా, పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించకుండా ఉపాధ్యాయ, ఉద్యోగుల నుండి ఈహెచ్ఎస్ పేరు మీద విధానాలు ఖరారు కాకముందే డబ్బులు వసూలు చేయడం ఉపాధ్యాయ వర్గాలను మోసం చేయడమే అవుతుందని పేర్కొన్నారు. ఈ విధానాన్ని వ్యతిరేకిస్తూ ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగుల పట్ల అసంబద్ధ వైఖరిని ఇప్పటికైనా మానుకోవాలని, సరైన విధివిధానాలను ప్రకటిస్తూ హెల్త్‌కార్డు అమలు చేసే విషయంలో ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేయవద్దని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే ఈహెచ్ఎస్‌పై విధివిధానాలను రూపొందించాలని, నిర్బంధమైన చెల్లింపు లేకుండా, అవసరమున్న ఉపాధ్యాయులకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టాలని, భార్యభర్తలు ఇరువురు ఉపాధ్యాయులను సందర్భంలో ఒక్కరికి మాత్రమే ప్రీమియం చెల్లించబడేలా మార్గదర్శకాలు రూపొందించాలని, ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా ఏయే ఆసుపత్రుల్లో, ఏయే వ్యాధులకు చికిత్స అందుబాటులో ఉంచుందో ఎలాంటి మార్గదర్శకాలు లేకుండా ప్రతి ఉపాధ్యాయుని బేసిక్ వేతనం నుండి 1.5 శాతం కోత విధించడం సరైన విధానం కాదని, ఇప్పటికైనా సరైన మార్గదర్శకాలు ప్రకటించి అందరి ఆమోదయోగ్యంతో ఈహెచ్ఎస్‌టి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## రోడ్డు ప్రమాదంలో నర్సింగ్ విద్యార్థిని మృతి

**జోగిపేట, మే 31, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో ఓ యువతి మృతి చెందిన సంఘటన ఆదివారంనాడు జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. టేక్మాల్ మండలం సూరంపల్లికి చెందిన సాయిలుకు అల్లాదుర్గం మండలం మాందాపురం గ్రామానికి చెందిన స్రవంతికి ఇటీవలే వివాహం నిశ్చయమైంది. కాగా స్రవంతికి నర్సింగ్ పరీక్షలు ఉండటంతో ఆదివారంనాడు స్రవంతిని తన బైక్‌పై ఎక్కించుకొని హైద్రాబాదులో వదిలేసేందుకు వెళ్తుండగా మార్గమధ్యలో కన్‌సాన్‌పల్లి శివారులో వెనకవైపు నుంచి వస్తున్న ఆర్‌జె 19, జిజె 3265 గల లారీ వేగంగా ఢీకొట్టడంతో బైక్‌పై మీద వెళ్తున్న సాయిలుకు తీవ్ర గాయాలయ్యాయి. బైక్ మీద నుంచి కింద పడగా స్రవంతి పైనుంచి , ఆమె తలమీదుగా లారీ వెళ్లడంతో తల నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందింది. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు జోగిపేట ఎస్ఐ పాండు తెలిపారు.

## మాసానిపల్లిలో ఆరుగురు జూదరుల అరెస్ట్

**జోగిపేట, మే 31, ప్రభాతవార్త:** పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో పోలీసులు దాడిచేసి పోలీసులు జూదరులను అరెస్ట్ చేసారు. ఆదివారంనాడు సాయంత్రం మండల పరిధిలోని మాసానిపల్లి గ్రామ శివారులో పలువురు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేసి పేకాట ఆడుతున్న గడ్డమీది మల్లేశం, ఊస నరెందర్, డాకూరి రమేష్, వావిలాల లక్ష్మయ్య, చింతకుంట వెంకటేశం, ఎర్రోళ్ల నరేష్ అనే ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి రూ. 28,430ల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, ఆరు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేసినట్లు జోగిపేట ఎస్ఐ పాండు తెలిపారు.

## సంతానం కలగలేదని మహిళ ఆత్మహత్య

**నర్సాపూర్, మే 31, ప్రభాతవార్త :** నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన కట్ట ఊర్మిళ (48) శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. పెళ్లయి ఇన్నేళ్లయినా పిల్లలు కలగలేదనే తీవ్ర మనస్తాపంతో ఆమె గ్రామ సమీపంలోని ఊరకుంటలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. శనివారం మధ్యాహ్నం చేనుకు వెళ్తానని ఇంటి నుంచి వచ్చిన ఆమె ఈ నిర్ణయం తీసుకుంది. సాయంత్రం కుంటలో శవం తేలుతుండటాన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య మరణంపై ఎలాంటి అనుమానాలు లేవని భర్త కట్ట రామయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# స్వామి వారిని దర్శించుకున్న న్యాయమూర్తి

**ఆలయానికి విరాళంగా ఎసి అందజేత**

**కొమురవెల్లి, మే 31, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామిని సిద్దిపేట ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, ఎఫ్ఎసి కార్యదర్శి జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఎన్. సంతోష్‌కుమార్ ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో వినియోగించుకోవడానికి తన స్వంత ఖర్చుతో కొనుగోలు చేసిన ఎసిని ఆలయ అధికారులకు అందజేశారు. భక్తులకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం కలిగించేందుకు చిన్న ప్రయత్నం చేసినట్లు న్యాయమూర్తి తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తి కుటుంబీకులు పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం ఎసి విరాళంగా అందించిన న్యాయమూర్తికి ఆలయ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.



ఎసిని విరాళంగా అందిస్తున్న న్యాయమూర్తి సంతోష్‌కుమార్

# భక్తులతో కిటకిటలాడిన తునికి నల్ల పోచమ్మ ఆలయం

**–ఆలయ అభివృద్ధికి దాతలు విరాళాలు అందించాలి**

**కౌడిపల్లి, మే 31, ప్రభాతవార్త:**

జిల్లాలలోనే రెండవ అతి పెద్ద జాతరగా పేరుగాంచిన తునికి నల్ల పోచమ్మ ఆలయం ఆదివారం నాడు భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుండియే భక్తుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. తునికి నల్ల పోచమ్మ ఆలయ ఇంచార్జి ఈవో రంగరావు, అభివృద్ధి కమీటి చైర్మెన్ తాళ్ల శ్రీనివాస్ రెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన పూజారి శివప్ప వేద మంత్రాల నడుమ అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి, కుంకుమార్చన ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత భక్తులకు దర్శనాలను కల్పించారు. సర్పంచుల ఫోరమ్ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రం కృష్ణాగౌడ్ తునికి నల్ల పోచమ్మ ఆలయం ప్రాంతంలో లింగంపల్లి గ్రామ సర్పంచ్ పరంలాల్ కూతురు, కుమారుడి పుట్టుపంచల కార్యక్రమాన్ని హాజరైతున్న సందర్భంలో నల్ల పోచమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలను జరిపించారు. కాగా ఆలయాన్ని విచ్చేసిన మాజీ పాలక వర్గ సభ్యులు, సర్పంచుల ఫోరమ్ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రం కృష్ణాగౌడ్‌ను ఆలయ జూనియర ఆసిస్టెంట్ వెంకట్ రెడ్డి, ప్రధాన అర్చకులు శివప్పలు శాలువ కప్పి ఘనంగా సన్మానించి, ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. భక్తులు శివ సత్తుల శిగాలు, డప్పు చప్పుల దరువుల నడుమ అమ్మవారికి బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన తర్వాత అమ్మవారి ఎదుట బోనం నైవేద్యాలను పెట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గర్భగుడిలో అమ్మవారి దర్శనం చేసుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించి, అమ్మ ఆశీర్వాచనం పొందారు. కొంత మంది భక్తులు తమ కోరికలు తీర్చిన శ్రీ నల్ల పోచమ్మ తల్లికి ఒడి బియ్యం సమర్పించి, జంతు బలి ఇచ్చి మొక్కులు



తునికి నల్ల పోచమ్మకి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు తమ మొక్కులు తీర్చుకుంటున్న దృశ్యం

తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కల్గకుండా ఆలయం సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వేసవి ఎండ తీవ్రత రూపం దాల్చుతున్న సందర్భంలో ఆలయంకు విచ్చేసే భక్తులకు త్రాగునీటి సమస్య రాకుండా ఆలయ అభివృద్ధి కమీటీ సభ్యులు, ఆలయ సిబ్బందితో మౌళిక సదూపాయాలను కల్పిస్తున్నట్లు ఈవో తెలిపారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమకు తొచినంత విరాళాలు ఇస్తే భక్తులకు సౌకర్యార్థం కాటేజ్‌లు నిర్మించ బడుతాయని ఇంచార్జి ఈవో రంగ రావు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వీరితో పాటు గ్రామ సర్పంచ్ ధనలక్ష్మి శేఖర్, ఉప సర్పంచ్ మధుసూధన్ గౌడ్, ఆలయం జూనియర ఆసిస్టెంట్ వెంకట్ రెడ్డి, ఆలయ పూజారి రాజేశ్వర్, విఘ్నేశ్ అప్ప, గ్రామ పెద్దలు సాయా గౌడు, శంకర్, శేఖర్, చల్ల మల్లేశం, ఆరీఫ్, దేవేందర్ కుమార్, రాగుల భూమయ్య పటేల్, రాగుల సరేష్ పటేల్, దేవులపల్లి రోట్టేల విఠల్ ముదిరాజ్, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అధిక జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా ఘనంగా పూజలు

**సదాశివపేట, మే 31, ప్రభాతవార్త:** అధిక జ్యేష్ఠ మాస పౌర్ణమి సందర్భంగా సదాశివపేట పట్టణంలోని శ్రీ సంగమేశ్వర ఆలయంలో ఆదివారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి నారాయణరావు పంతులు ఆధ్వర్యంలో ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పంచామృతాలతో, సుగంధ పరిమళ పుష్పాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారి నారాయణరావు పంతులు మాట్లాడుతూ అధిక మాసంలో వచ్చే పౌర్ణమి రోజున నీలకంఠేశ్వరుడైన పరమశివుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధించడం వల్ల రాబోయే కాలం శుభప్రదంగా మారుతుందని తెలిపారు. భక్తితో చేసే పూజల వల్ల కాలం అనుకూలిస్తుందని పేర్కొన్నారు. అలాగే అధిక జ్యేష్ఠ మాస పౌర్ణమిని పురస్కరించుకొని సాగర్ నగర్‌లోని ఖాళీకా హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి కృపతో సమృద్ధిగా వర్షాలు కురవాలని, నిత్యావసర వస్తువుల ధరలు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండాలని భక్తులు ప్రార్థించారు.

# దుర్గమ్మ చెంత... భక్త జన సంద్రం....

**పాపన్నపేట, మే 31, ప్రభాతవార్త :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసి పోయింది. వేసవి సెలవులు, ఆదివారం ప్రభుత్వ సెలవు కావడంతో వివిధ జిల్లాలు, ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఏడుపాయల క్షేత్రం ఎటు చూసినా భక్త జనసంద్రంగా మారి చిన్న జాతరను తలపించింది.

భక్తులు ముందుగా మంజీరా మడుగులు, చెక్‌డ్యాం, పాయలలో పుణ్యస్నానాలు ఆచరించి అనంతరం అమ్మవారి దర్శనానికి క్యూ లైన్లలో గంటల తరబడి వేచి ఉన్నారు. దర్శనం అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. పలువురు భక్తులు బోనాలు, ఒడిబియ్యం, తలనీలాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ ఈవో వీరేశం ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది తగిన ఏర్పాట్లు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. వేద పండితులు రాజేష్ శర్మ, పార్థివ శర్మ, మురళి, శంకర్ శర్మ, రాజశేఖర్, రాము తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇక భక్తుల రద్దీ నేపథ్యంలో పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తమ సిబ్బందితో కలిసి కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా చర్యలు చేపట్టి భక్తులకు సురక్షి త వాతావరణం కల్పించారు.



భక్తులకు దర్శనమిస్తున్న వనదుర్గమ్మ

## బిజెపికి వేణుమాధవ్ రాజీనామా

**సదాశివపేట, మే 31, ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ క్రియాశీల సభ్యత్వానికి ఆ పార్టీ రాష్ట్ర నాయకులు నెమలికొండ వేణుమాధవ్ రాజీనామా చేశారు. ఈ విషయాన్ని ఆయన ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. గత పది సంవత్సరాలుగా బిజెపిలో రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా, ముషీరాబాద్ మరియు కామారెడ్డి నియోజకవర్గాల ఇన్‌చార్జిగా సేవలందించిన వేణుమాధవ్, బండి సంజయ్ చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్రకు రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్‌గా కూడా పనిచేశారు. త్వరలోనే తన రాజకీయ భవిష్యత్ కార్యా చరణను ప్రకటిస్తానని ఈ సందర్భంగా తెలిపారు. ఈ పదేళ్ల రాజకీయ ప్రయాణంలో తనకు సహకరించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె. లక్ష్మణ్, బండి సంజయ్, రామచంద్రరావు, ఎంపీ రఘునందన్ రావులకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఆర్ఎస్ఎస్, హిందూ వాహిని నేపథ్యం కలిగిన నెమలికొండ వేణుమాధవ్ బిజెపికి రాజీనామా చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## ముఖ్యమంత్రి వ్యాఖ్యల పై మాజీ ఎమ్మెల్యే ఖండన..

**పాపన్నపేట, మే 31, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ మంత్రి హరీష్ రావుపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మెదక్ మాజీ ఎమ్మెల్యే పీ.శశిధర్ రెడ్డి ఆదివారం రోజు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజా నాయకుడు, ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న రేవంత్ రెడ్డి ఓ మంత్రిని టార్గెట్ చేస్తూ అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, కించ పరచడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చ లేకరైతులు పండించిన పంటలు కొనుగోలు చేయటం చేతగాక ప్రతి పక్ష నాయకులపై నోటి దురుసుతో కించ పర్చటంతో తమ తప్పులను కప్పి పుచ్చుకునేందుకు ఈలాంటి వ్యాఖ్యలు చేయడం రాష్ట్ర ప్రజానీకం గమనిస్తున్నారన్నారు.

## నాగారం గ్రామంలో కుటుంబం కుల బహిష్కరణ..!

**హుస్నాబాద్ టౌన్, మే 31, ప్రభాతవార్త:** శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచం దూసుకుపోతున్న ఈ కాలంలోనూ కొన్ని గ్రామాల్లో కుల వివక్ష ఇంకా కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. హుస్నాబాద్ మండలం నాగారం గ్రామంలో ఓ ముదిరాజ్ కుటుంబాన్ని కుల బహిష్కరణ చేసిన ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గ్రామానికి చెందిన ఆకుల బాలయ్య కుటుంబం గత ఏడు సంవత్సరాలుగా చేపల చెరువు వ్యవహారంలో అదే కులానికి చెందిన కొంతమందితో వివాదాలు ఎదుర్కొంటోందని, ఈ క్రమంలో గతంలో నమోదైన కేసులను పెద్దమనుషుల సమక్షంలో లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకుని రాజీకి వచ్చినప్పటికీ, వివాదం ఇంకా పూర్తిగా ముగియలేదని బాధిత కుటుంబ సభ్యులు ఆదివారం రోజున పట్టణ కేంద్రంలో విలేకరుల ఎదుట తమ గోడు వెల్లబోసుకున్నారు. బాధితుడు ఆకుల బాలయ్య చెప్పిన వివరాల ప్రకారం గ్రామంలోని తమ కుల పెద్దలు తమ కుటుంబాన్ని కులం నుంచి బహిష్కరించా రని, గ్రామంలో జరిగే పెళ్లిళ్లు, శుభకార్యాలు, అంత్యక్రియలు వంటి కార్యక్రమా లకు రావద్దని హెచ్చరించారని, దీంతో తమ కుటుంబం సామాజికంగా ఒంటరై పోయిందని, గ్రామంలో తలెత్తుకుని తిరగలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ తమ కుటుంబానికి కొందరు పెద్దమనుషుల నుంచి ప్రాణహాని ఉందన్నారు. తమ కుటుంబాన్ని కొద్ది సంవత్సరాలుగా నిరంతరం మానసిక వేధింపులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకుని వారికి న్యాయం చేయాలని వేడుకున్నారు.

**తెలంగాణ ఆడపడుచులకు**

## రేవంత్ సర్కార్ చిరు కానుక

**సదాశివపేట, మే 31, ప్రభాతవార్త :** సదాశివపేట పట్టణంలోని సంగమేశ్వర ఆలయంలో డ్వాక్రా గ్రూప్ మహిళలకు ఇందిరమ్మ చీరల ఉచిత పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 19వ వార్డు కౌన్సిలర్ రోజా నాగరాజుగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మహిళలకు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రోజా నాగరాజు గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని మహిళలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని రంగాలలోనూ ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. డ్వాక్రా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. మహిళలు స్వశక్తితో ఎదగా లని ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందని,



రాజకీయాలు, వ్యాపార రంగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకు పలు సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తున్నట్లు పేర్కొన్నారు. టీజీవీసీ చైర్మన్ నిర్మలారెడ్డి, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సహకారంతో పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా గ్రూప్ ఆర్‌పీలు కిరణ్మయి, విజయ, సుజాతతో పాటు గ్రూప్ సభ్యులు మంగమ్మ, రుక్మిణి, సావిత్రి పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**దుద్యాల్, మే 31, ప్రభాతవార్త:** మండల పరిధిలోని లగచర్ల గ్రామానికి చెందిన బంక మల్లయ్య అనారోగ్యంతో మరణించడంతో గ్రామ సర్పంచ్ వెంకట్ రాములు గౌడ్ రూ. 5000 ఆర్థిక సాయం అందజేశారు. ఆయనతోపాటు మండల యాదవ సంఘం అధ్యక్షులు కావలి నరసింహులు, శ్రీనివాస్, లక్ష్మయ్య, రామాంజనేయులు, యాదయ్య, వెంకటయ్య, అరవింద్ తదితరులు ఉన్నారు.





పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం దృశ్యం

# గురుకుల జ్ఞాపకాల సందడి

**600 మందికి పైగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక**

**హుస్నాబాద్ రూరల్, మే 31, ప్రభాతవార్త:**

హుస్నాబాద్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 1996 నుంచి 2016 మధ్య విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. దాదాపు 20 బ్యాచ్‌లకు చెందిన 600 మందికి పైగా పూర్వ విద్యార్థులు ఒకేచోట చేరి తమ పాఠశాల రోజుల జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందోత్సాహాల మధ్య కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేలా మార్గనిర్దేశం చేసిన గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

**గురుకుల విద్య జీవితాలను మలిచింది : సీఐ కన్నం మధు**

ఆదివారం రోజున జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల పూర్వ విద్యార్థి గచ్చిబౌలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కన్నం మధు మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాయని, గురుకుల విద్య వల్లే తాను సమాజంలో మంచి స్థాయికి ఎదగగలిగానన్నారు. హుస్నాబాద్ గురుకులంలో గడిపిన రోజులు తన జీవితంలో మరపురాని జ్ఞాపకాలుగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డా వి. కుమార్ (అసిస్టెంట్ ప్రొఫెసర్), కన్నం మధు (ఆర్ఐ), రమేష్ (ఎస్ఐ బెటాలియన్), అంజి (ఎస్ఐ ట్రాఫిక్), రాజు (ఎస్ఐ పోలీస్), నరేష్ (ఇండియన్ కోచ్, వరల్డ్ కప్ కోచ్), డా వి. సురేందర్ (పీడీ), వి. స్వామి (ఉపాధ్యాయుడు), సురేందర్ నాయక్ (ఏఈఓ), వి. మహేందర్ (లెక్చరర్), కట్టా సంపత్ (సాఫ్ట్‌వేర్ ఉద్యోగి), కన్నం కోటేష్, ప్రభాకర్, రాజు, రవీందర్, సత్యం, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ములుగులో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

**ములుగు, మే 31 (ప్రభాతవార్త):**

మండలకేంద్రమైన ములుగు ప్రభుత్వ పాఠశాలలో 2000-01 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ములుగులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించుకున్నారు. పదవ తరగతి పూర్తిచేసుకొని 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అందరూ ఒక్క చోటకు చేరుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడంతో పాటు ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ప్రధానోపాధ్యాయుడు మహబూబ్‌రెడ్డి, ఉపాధ్యాయులు దివాకర్‌రెడ్డి, హ్యాపీదిన్, షరీఫ్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**అహ్మదీపూర్‌లో...**



అహ్మదీపూర్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

**గజ్వేల్ టౌన్, మే 31 (ప్రభాతవార్త):**

గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06 విద్యాసంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు 20 సంవత్సరాల తర్వాత కలుసుకొని ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో గత తీపి గుర్తులను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు. చిన్ననాటి మిత్రులతో పాటు చదువు నేర్పిన గురువులు ఒకే చోట కలవడం బాల్యం నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకోవడం, ఆ మధుర క్షణాలు మాటల్లో చెప్పలేనివని పూర్వ విద్యార్థులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్‌రెడ్డి, లచ్చిరెడ్డి, లక్ష్మారెడ్డి, పరమేష, నరేందర్‌రెడ్డి, శామ్యూల్, రహీం, విగ్నేశ్వర్‌రెడ్డి, బ్యాగరి ప్రభాకర్, నిజామొద్దీన్, నరేష్‌గౌడ్, సత్యపాల్, రమేష్, రఫీ, రజిత, తేజ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ లెర్నింగ్ భవిష్యత్తులో విద్యకు కీలకం



బీవీఆర్ఐటిలో జరిగిన సర్టిఫికెట్ ప్రధానోత్సవంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేత

**నర్సాపూర్, మే 31, ప్రభాతవార్త :**

ఏఐ మరియు డిజిటల్ లర్నింగ్ భవిష్యత్ విద్యకు కీలకమని బీవీఆర్ఐటి డైరెక్టర్ డా.కే. లక్ష్మీ మ్మ ప్రసాద్, ప్రిన్సిపల్ డా. సంజయ్ దూబే, హెచ్ ఓ డి డా. దశరథ రామయ్య పేర్కొన్నారు. నర్సాపూర్ పట్టణ సమీపంలోని బి వి ఆర్ ఐ టి కళాశాలలో బి వి ఆర్ ఐ టి ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ హైదరాబాద్, తెలంగాణ ప్రభుత్వం సహకారంతో నిర్వహించిన ఏఐ మరియు డిజిటల్ లర్నింగ్ వర్క్ షాప్ ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు ఏఐ మరియు డిజిటల్ లెర్నింగ్ సాంకేతికతపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలు మరియు భవిష్యత్ అవకాశాలపై అవగాహన పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ వర్క్‌షాప్ విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ వారు అభినందనలు తెలియజేశారు. ఈ వర్క్‌షాప్‌లో మంగలి సాయికిరణ్ మరియు కోత చంద్రకళ వనరుల వ్యక్తులుగా వ్యవహరించి, కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ లెర్నింగ్ టూల్స్ మరియు వాటి అనువర్తనాలపై సవివరంగా వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా స్పందించి, చురుకుగా పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సర్టిఫికెట్ ప్రదానోత్సవంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

